క్లుప్తంగా

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఏడీఏ, నాగమల్లేశ్వరరావు

గురజాల/రెంటచింతల : పశు వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ నాగమల్లేశ్వరరావు సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో 20వ తేదీ తేదీ నుంచి 31 వరకు అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాల్లో పశు ఆరోగ్య పరీక్షలు, తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువులకు, దూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులు, పశువులకు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

దుప్పట్లు పంపిణీ

మాచర్ల: అబ్దుల్ కలాం సేవా సమితి, రంగమ్మ చిల్డ్రన్స్ హాస్పిటల్, బాలాజి డెంటల్ ఆసుపత్రి సంయుక్తంగా వృద్ధులకు, అనాథలకు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. 20 మంది వృద్ధులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేసి అబ్దుల్ కలాం సేవా సమితి ఫౌండర్ షేక్ పాషావలి మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు గాను అనేక మంది ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలందించటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మూడావత్ దశరథ్, సైదులు నాయక్‌తో పాటు దివ్యాంగుల సంఘ నాయకులు అంజిబాబు, శంకర్, మక్కెన కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్‌వలిలు పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత మెడిటేషన్ క్లాసులు

మాచర్ల: పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో యోగా, మెడిటేషన్ క్లాసులు జనవరి 26వ తేదీన ప్రారంభించనున్నట్లు అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ నెల 26 నుంచి నెల రోజుల పాటు శ్రీశైలం రోడ్డులోని వివేకానంద సేవాశ్రమంలో ఈ క్లాసులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 8 వరకు క్లాసులను మెడిటేషన్ నిపుణులు టి.ఇందిరాదేవి నిర్వహిస్తారన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్లాసులను ఉచితంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9346162835, 9440006813ను సంప్రదించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



పిడుగురాళ్ల : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడుతూ ఆరోగ్యం క్షీణించి ఆర్థిక స్తోమత లేక ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 23 మందికి రూ.41 లక్షల చెక్కులు అందించామన్నారు. ముందుగా దాచేపల్లికి చెందిన దాసరి కోటయ్య అనే బాలుడికి ఆపరేషన్ చేయించుకునేందుకు ఎల్.ఓ.సి ద్వారా రూ.10 లక్షల చెక్కును అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి చేయూత



మాచర్ల: పట్టణంలోని 18వ వార్డులో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న ఎం.కుమారి ఇటీవల మృతి చెందటంతో స్పందించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు సంయుక్తంగా రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు.సీఐటీయూ నాయకులు మహేష్, వేముల వెంకట్రావు, ఉషారాణి, ప్రాజెక్టు పరిధిలోని టీచర్లు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర పరీక్షలు



సత్తెనపల్లి: ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం అన్నారు. పట్టణంలోని వడవల్లి 16వ వార్డులో కలాం అబిల్ కలామ్ థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 200 మంది నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అగర్వాల్ నేత్ర పరీక్ష కేంద్రం సిబ్బంది డాక్టర్ చందోలు నాగవాణి, సుజాత, మస్తాన్ వలి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పాస్టర్ సత్యానందం, బండారు నాగరాజు, చిలుకా రమణయ్య, ఎంఆఎఫ్ నాయకులు గరికపాటి హిట్లర్, చిలుకా జాన్సన్, బొద్దు సాయి, నల్లూరి కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

ఎండిపోతున్నా.. పట్టించుకోరా..?!

- భూములకు అందని సాగునీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- కాలువ అభివృద్ధి పనులు చేపట్టని ప్రభుత్వం
- బోరు రైతుల నుంచి సాగు నీరు కొనుగోలు
- ఒక ఎకరానికి ఒక తడికి అదనపు పెట్టుబడి రూ.1,000



చుక్క కూడా సాగునీరు రాని రెంటచింతల మేజర్ కాలువ (ఎర్రకాలువ)



సాగునీరు అందక ఎండిపోయిన మిర్చి పంట

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివారులోని రెంటచింతల మేజర్ కాలువ (ఎర్రకాలువ) ఆయకట్టు చివరి భూముల రైతుల పంటలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు సకాలంలో వర్షాలు పడటంతో రైతులు సాగు చేస్తున్న పంటలు కళకళలాడాయి. మండలంలో ఎక్కువ రైతులు సాగునీటి కోసం కాలువలపై ఆధారపడుతున్నారు. రెంటచింతల మేజర్ కాలువ (ఎర్రకాలువ) కింద మాడుగుల, మంచికల్లు, రెంటాల, రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి గ్రామాల పరిధిలో సుమారు 4,384 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే ఈ ఏడాది ఆయకట్టు చివరి భూముల రైతులు కొందరు ఖరీఫ్‌లో సాగుచేసి తీవ్రంగా నష్టపోయి మొక్కజొన్న పంటను ప్రస్తుతం సాగు చేస్తున్నారు. ఈ కాలువకు ఎగువనున్న మంచికల్లు, రెంటాల గ్రామాలకు చెందిన రైతులు సాగుచేసే వరి పంట కోత వరకు రెంటచింతల, మిట్టగుడిపాడు, గోలి గ్రామాల పరిధిలోని దిగువనున్న రైతులకు సాగునీటి కష్టాలు తప్పవని కొందరు రైతులు వాపోతున్నారు. పంటలకు సాగునీరు అవసరం లేని వర్షాకాలంలో మాత్రం ఈ కాలువ ద్వారా చివరి వరకు సాగునీరు వస్తుందని.. మిగిలిన సమయంలో సాగునీరు అందని ద్రాక్ష అని వెంకటరెడ్డి, సుబ్బారావు అనే రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్న పంటలను కాపాడుకునేందుకు బోరు నీటిని ఒక్క తడికి ఎకరానికి రూ.1,000 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు. మేజర్ కాలువ అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం కాలువ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోవడం.. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సాగునీటి అధికారులు కాలువ అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు ఆయకట్టు చివరి భూముల రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందని ద్రాక్ష



ఆయకట్టు చివరి భూముల రైతులకు సాగునీరు అందని ద్రాక్ష. ఈ ఏడాది ఎకరం రూ.14 వేలు చొప్పున 10 ఎకరాలను కౌలుకు తీసుకుని 5 ఎకరాలు మిరప, మరో 5 ఎకరాలు పత్తి పంటలను సాగు చేశా. పత్తి పూర్తిగా దెబ్బతినగా పీకి వేసి మొక్కజొన్న పంట వేశాను. ఎకరం మిర్చి పంటకు రూ. 1.10 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇప్పుడు సాగునీరు రాకపోవడంతో మిర్చి పంటను కాపాడుకునేందుకు ఒక్క తడికి ఎకరానికి రూ.1,000 ఇస్తున్నా. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు ఇస్తేనే రైతుల సాగునీటి కష్టాలు తీరతాయి.

–బోయిన అమరలింగయ్య,
కౌలురైతు, రెంటచింతల

అధికారులు చర్యలు చేపట్టాలి



మేజర్ కాలువ (ఎర్ర కాలువ) కింద 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు పంటలకు సుమారు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. కాలువ ద్వారా సాగునీరు అందకపోతే సాగుచేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ మేజర్ కాలువ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అధికారులు ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలి.

– బోయిన కోటేశ్వరరావు,
కౌలురైతు, రెంటచింతల

పంటలు ఎండిపోతున్నాయి



ఎర్ర కాలువకు ఎగువనున్న రైతులు అడ్డగోలుగా సాగునీరు మళ్లించడం వలన ఆయకట్టు చివరి భూముల రైతులు సాగుచేస్తున్న పంటలు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. ఈ ఏడాది వేసిన పత్తి నీరు లేక దిగుబడి రాకపోవడంతో పీకి వేసి 2 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. కాలువ దిగువనున్న రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు సాగు నీరు అందించడానికి ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు తీసుకోవాలి.

– పేర్ల చౌదయ్య,
కౌలురైతు, రెంటచింతల

కబడ్డీ సీనియర్స్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టు

పిడుగురాళ్ల : స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో 71వ అంతర జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి డి.నల్లిరెడ్డి, ఉపాధ్యక్షుడు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎం.నాగేంద్రబాబు, నల్లపాటి ధనుంజేయులు, ఆవుల జనార్దన్, మదినా మస్తాన్‌వలి, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటన నిరసిస్తూ సీపీఐ ప్రదర్శన



అమిత్‌షా పర్యటనను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినదించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్రంలోనూ, రాష్ట్రాల రాజకీయాలలోనూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మణిపూర్ ఘటనలపై ప్రధాని మోదీ ఇంతవరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, షేక్ చినజాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి..

నరసరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడ వచ్చిన అమిత్‌షాకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల మార్కెట్ యార్డు ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.గోపాలరావు, షేక్ సిలార్ మసూద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయరాజు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకుడు కంబాల ఏడుకొండలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన




గురజాల : స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం చిట్టెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని డీఎస్పీ జగదీష్ ప్రారంభించి మాట్లాడుతూ వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం గర్వించదగిన విషయమన్నారు. పుట్టి పెరిగిన ఊరికి ఈ విధంగా సహాయం చేయడం అదృష్టంగా భావించడం శుభపరిణామమన్నారు. ఈ వైద్య శిబిరంలో 1500 మందికి వైద్య పరీక్షలు చేయడం జరిగిందన్నారు. వైద్యులు జయకిషన్, రాజశేఖర్, విష్ణు ప్రసాద్, శివ ప్రసాద్, సాయి కృష్ణారెడ్డి, శ్రీదేవి, స్రవంతి, సాహితి, అనితలు వైద్య సేవలు అందించారు. మునిసిపల్ కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, ఎన్ బొల్లయ్య, జాస్తి ప్రకాష్, కటికం అంకారావు, బడిదెల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్ చోరీ

రెంటచింతల: రెంటచింతల–గురజాల మార్గంమధ్యలో నున్న తుమ్మా రాయపరెడ్డి పంట పొలంలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్ నర్సరీ వద్ద నున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్ ఆదివారం తెల్లవారు జామున చోరీకి గురైంది. నర్సరీ వద్ద ఉంటున్న వారు ఊరు వెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్‌ను అపహరించారు. దీని విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు భావిస్తున్నారు. ఈ నెల 13న రెంటచింతల గ్రామానికి చెందిన గోగిరెడ్డి బాలరెడ్డి ఎర్రకాలువ సమీపంలో ఏర్పాటు చేసుకున్న షేడ్ నెట్ నర్సరీ వద్ద నున్న గదికి వేసిన తాళాలు పగులగొట్టి రూ.30వేల విలువైన పురుగు మందులను దొంగలు చోరీ చేశారు. డిసెంబర్ నెలలో మిట్టగుడిపాడు, మంచికల్లు గ్రామాలలో 3 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలోని రాగి వైర్ కూడా చోరీకి గురైన విషయం పాఠకులకు విదితమే.

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్‌గా నాగేశ్వరరావు



సత్తెనపల్లి: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్‌గా సత్తెనపల్లి వాసవి మణికంఠ క్లబ్ పూర్వాధ్యక్షుడు వనమా నాగేశ్వరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నరసరావుపేటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన మొదటి క్యాబినెట్ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వనమా నాగేశ్వరావు మాట్లాడుతూ అమరావతి వాసవి క్లబ్ కపుల్స్, తుళ్లూరు వాసవి క్లబ్, తాడికొండ వాసవి క్లబ్, రావెల వాసవి క్లబ్‌లు తన పరిధిలో ఉంటాయన్నారు. నాగేశ్వరావును ఆర్య వైశ్య నాయకులు, రోటరీ క్లబ్ బాధ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, ప్రెసిడెంట్ మాతంగి సాంబశివ రావు, క్లబ్ డైరెక్టర్లు సరికొండ రమాదేవి, వెంకటేశ్వరరావు, డాక్టర్ లేళ్ళ అయోధ్యకృష్ణ, కంచేటి నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు ఉన్నారు.

పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్‌గా ప్రముఖ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం.మూర్తి, ఆర్.శంకర్, సెక్రటరీగా కె.వందనంబాబు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్ బాజీ, బీరం శ్రీను, ట్రెజరర్‌గా ఎస్.కె.సైదాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని, అలాగే పెయింటర్స్, ఆర్టిస్ట్‌లకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డులు కొరకు కృషి చేస్తామని, వారికి అండగా పనిచేస్తామని తెలిపారు. ఎం.పోలు రాజు, ఎస్.రాజు కుమార్ సింగ్, జి.చంద్రం, కె.నాగరాజు, పి.రామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నవకలశ పంచామృత స్నపన

అమరావతి: మండలంలోని మల్లాది గ్రామం వటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి ఆలయ 48వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నవకలశ పంచామృత స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు మూల విరాట్‌కు పంచసూక్త యుత పంచామృత స్నపన నిర్వహించి, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం జరగబోయే స్వామి వారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రారంభించాలి

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు సత్వరమే ప్రభుత్వం ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి రైతు సంఘం నాయకుడు కనగాల వెంకట రామ మోహన్‌చందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో నిలుపుదల చేయటంతో గత్యంతరం లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం సత్వరమే కొనుగోలు ప్రారంభించాలన్నారు. రైతుల ముసుగులో దళారులు ప్రభుత్వానికి ధాన్యం అమ్మటం హేయమైన చర్య అన్నారు. కొనుగోలు కేంద్రాలు నిలుపుదల చేయటం వల్ల దళారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి రైతులను దోచుకోవటంతో పాటు కాటాల్లో కూడా మోసం జరుగుతుందన్నారు. తూనికలు కొలతల శాఖ అధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే కాటాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం రవాణా చార్జీలపై సడలింపు చేయాలన్నారు. చివరిగింజ వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చినా కొనుగోలు నిలుపుదల చేయటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు సంఘం నాయకులు భువనగిరి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, వెంకటరాయుడు పాల్గొన్నారు.

పోటెత్తిన అభిమానం

పీఆర్కే కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సందడి



పీఆర్కేను కలిసిన పట్టణ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, ఎస్సీ నాయకులు

మాచర్ల: నియోజకవర్గ కేంద్రం మాచర్లకు అనివార్య కారణాల వలన కొద్ది నెలలు దూరంగా ఉన్న మాజీ ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెండు రోజులుగా మాచర్లలో ఉండటంతో ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచే మాచర్ల, కారంపూడి, దుర్గి, రెంటచింతల, వెల్దుర్తి మండలాల నుంచి మండల స్థాయి నాయకులు, మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు పీఆర్కేను కలిశారు. జగన్, పీఆర్కేలకు జే జేలు పలుకుతూ ఉత్సాహంగా కార్యకర్తలు సందడి చేశారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు, అభిమానులు కేక్‌లు తీసుకొచ్చి ఆయనతో కట్ చేయించి శాలువాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ స్థాయిలో పీఆర్కే కార్యాలయానికి కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ పీఆర్కే పలకరించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన కార్యాలయం అభిమానులతో నిండిపోయింది.

ఏసు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో భక్తులు

విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. దీనికి ముందు పలువురు భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలను అనుసరించండి



ఇవాంజలికల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పశ్చిమ సినడ్ ఐజయ్య

మాచర్ల: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ ఐజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రార్థనలు జరగగా ఐజయ్య సందేశాన్నిస్తూ క్రీస్తును నిరంతరం ఆరాధించాలని, ఆయన బోధనలను అనుసరించాలని కోరారు. బైబిల్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకొని తోటి వారికి దేవుని సేవ గురించి తెలపాలన్నారు. క్రీస్తు నామం ఎంతో పవిత్రమైనదన్నారు. తోటివారిని ప్రేమించాలని కోరారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో చర్చి పెద్దలతో పాటు భారీ స్థాయిలో క్రైస్తవులు హాజరయ్యారు.

అయోధ్య రాముని విల్లుకు పూజలు



దాచేపల్లి : అయోధ్యరాముని కోదండ విల్లు ఆదివారం దాచేపల్లికి చేరుకుంది. హైదరాబాద్ నుంచి నగర పంచాయతీ పరిధిలోకి ప్రవేశించిన విల్లుకి భక్తులు స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు కేజీ బంగారం, 13 కేజీల వెండితో విల్లు, బాణం తయారు చేయించి అయోధ్యకు పంపిస్తున్నాడు. ఈ క్రమంలో దాచేపల్లిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో విల్లు, బాణంకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భక్తులు విల్లు, బాణం దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దాచేపల్లి నుంచి గురజాలకు విల్లు, బాణాన్ని సాగనంపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మాశెట్టి బుజ్జి, నాళం శ్రీనివాసరావు, గరిణే పుల్లారావు, మండేం రామారావు, బత్తుల వెంకయ్య, నాగేశ్వరరావు, దేవరశెట్టి రమేష్, బత్తుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): విశ్వబ్రాహ్మణ సంఘీయులందరూ ఐకమత్యంతో అన్నదాన సత్రం అభ్యున్నతికి సహకరించాలని అద్దంకి సుధాకర్ అన్నారు. నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి సన్నిధిలో అన్నదాన సత్రం నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడు అద్దంకి సుధాకర్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అన్నదాన సత్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నల్లగట్ల ఈశ్వరచారి అధ్యక్షతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికల అనంతరం ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. నూతన ఉపాధ్యక్షులుగా కుందుర్తి సీతారామాంజినేయులు, చందలూరి శివనాగేశ్వరరావు, సెక్రటరీ జుజ్జురి వాసవాచారిలను, పాత కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. స్థలదాత లక్కిరెడ్డి సంజీవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు వావిచర్ల వెంకటేశ్వర్లు నూజెండ్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మోతడక వీరాచారిలను ఘనంగా సత్కరించారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



మృతుడు అజయ్ (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని ఈపూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లవరపు అజయ్(42)కు గుండెపోటు రావటంతో గుంటూరు లలిత హాస్పిటల్‌కు నాలుగు రోజులు క్రితం తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. మృతదేహాన్ని అతని స్వగ్రామం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామానికి తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో అజయ్ నియోజకవర్గంలోని పలుస్టేషన్‌ల్లో హోంగార్డుగా విధులు నిర్వహించాడు.

హిందీ పండిట్‌కు పూలే అవార్డు



రాజుపాలెం: మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న రంగా జ్యోతిలక్ష్మి సావిత్రీబాయి పూలే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యింది. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. పాఠశాల హెచ్ఎం పీవీ ఇన్నారెడ్డి, ఫాదర్స్ విజయ్ పీటర్, కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ షాపులపై 6ఏ కేసు నమోదు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో చౌకధరల దుకాణాలపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన 10,11,38 నెంబరు షాపుల్లో సరుకుల వ్యత్యాసం ఉండటంతో తనిఖీ చేయగా వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. ఆయా రేషన్ షాపుల్లో 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ ఈ మేరకు తెలిపారు.

విక్రయ దస్తావేజులు పోయినవి
నేను ఆన్నం పార్వతమ్మ W/o సుబ్బారావు పిడుగురాళ్ళ కాపురస్థురాలిని పిడుగురాళ్ళలో నెం. 488/2008 గల దస్తావేజులను జిరాక్స్ తీయించుటకు వెళ్ళుతుండగా దస్తావేజులు షాప్స్ నుండి జారి పడిపోయినది. ఎవరికైనా దొరికినచో సంప్రదించగలరు.
సంప్ర॥ 9059316944

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com